ఆదర్శ రైతుల వ్యవస్థను పునరుద్ధరించాలి

మాట్లాడుతున్న ఆదర్శ రైతు సంఘం నాయకులు

వేమనపల్లి, నవంబర్ 7 : పంట సాగులో రైతులకు చేదోడువాదోడుగా ఉంటూ సలహాలు, సూచనలు అందించడంతో పాటు, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ ఫలాలను అందించడంలో, వ్యవసాయాధికారులు రైతులకు వారధిగా పనిచేసిన ఆదర్శ రైతుల వ్యవస్థను తిరిగి ప్రభుత్వం పునరుద్ధరించాలని ఆదర్శ రైతు సంఘం మండలాధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతిగౌడ్, ఉపాధ్యక్షుడు కోడూరి దుర్గయ్య కోరారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గురువారం వేమనపల్లి రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి ఎండీ జావీద్ అలీ, జాయింట్ సెక్రటరీ నైతం శంకర్, గౌరవాధ్యక్షుడు బొడ్డున వెంకటేశం, కుర్రు వెంకటేశం, రమేశ్‌రెడ్డి, ఎన్నం సంజీవ్, తిరుపతి, సంతోష్, ప్రభాకర్‌గౌడ్, ఆయిళ్ల రాజయ్య, రాజబాపు, రాజన్న, శ్రీనివాస్, తిరుపతి, బూదయ్య, మోహన్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో నేతకాని కులాన్ని నమోదు చేసుకోవాలి

మాట్లాడుతున్న నేతకాని సంఘం నాయకులు

తాండూర్, నవంబర్ 7 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో మండంలోని నేతకాని కులస్తులందరూ తప్పని సరిగా కాలం 40లో నేతకాని కులాన్ని నమోదు చేసుకోవాలని ఆ సంఘం మండలాధ్యక్షుడు గొర్లపల్లి విజయ్‌కుమార్ సూచించారు. తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సంఘం ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. 15 జీపీల పరిధిలోని పలువురు నేతకాని బాంధవులు తెలిసీతెలియక మాల, మహర్ అని ధ్రువీకరణ పత్రాలు పొందారని పేర్కొన్నారు. అలాంటివారు నేతకానిగా మార్చి ధ్రువపత్రాలు తిరిగి పొందాలని సూచించారు. సంబంధిత అధికారులు కూడా సహకరించాలని కోరారు. నేతకాని సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షుడు దుర్గం లక్ష్మీనారాయణ, ప్రధానకార్యదర్శి దాగం పాపయ్య, కార్యదర్శి బట్టి వెంకటేశం, ప్రచార కార్యదర్శి జాడి పోశం, సలహాదారు పోచయ్య పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

పొలంబాట కార్యక్రమంలో పాల్గొన్న ఏఈ శ్రీనివాస్

చెన్నూర్ రూరల్, నవంబర్ 7 : పంట పొలాల వద్ద రైతులు విద్యుత్ వాడకంపై పలు జాగ్రత్తలను తీసుకోవాలని ట్రాన్స్‌కో కొమ్మెర ఏఈ శ్రీనివాస్ సూచించారు. చెన్నూర్ మండలంలోని ఎర్రగుంటపల్లి, రచ్చపల్లి, కొమ్మెర, పొక్కూర్ గ్రామాల్లో సిబ్బందితో కలిసి పొలంబాట నిర్వహించారు. రైతులు మోటర్ల వద్ద కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

సమగ్ర సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, నవంబర్ 7 : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సిబ్బందికి సూచించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని సందీప్ నగర్‌లో సర్వే ప్రక్రియను గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి పరిశీలించారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సర్వే ప్రక్రియలో భాగంగా కేటాయించిన ఎన్యుమరేషన్ బ్లాక్‌ల ప్రకారం ఇండ్లను సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలను నిర్ణీత నమూనాలో స్పష్టంగా నమోదు చేయాలని, సర్వే చేసిన ప్రతి ఇంటికీ మార్క్ చేయాలని వివరించారు. సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని, ఇంటి యజమానులు అవసరమైన పత్రాలతో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి..

కాగజ్‌నగర్, నవంబర్ 7 : సర్వే ప్రక్రియలో కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సిబ్బందికి సూచించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఓల్డ్ కాలనీలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో కలిసి పరిశీలించారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భీమారం, నవంబర్ 7 : భీమారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఎన్యూమరేటర్లకు ఎంపీడీవో మధుసూదన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ సదానందం, ఎంపీవో సతీశ్ రెడ్డి, ఏఎస్‌వో కోమలత తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

వేమనపల్లి, నవంబర్ 7 : వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ రమేశ్ శిక్షణ నిర్వహించారు. పర్యవేక్షణ అధికారి ఇష్తేకర్, ఏపీవో సత్యప్రసాద్ పాల్గొన్నారు.

కాసిపేట, నవంబర్ 7 : కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ భోజన్న, ఎంపీవో సర్దార్ అలీ, ఏవో ప్రభాకర్, ఏఎస్‌వో అమరేందర్ రెడ్డి, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్‌పై వీడియో కాన్ఫరెన్స్

రెబ్బెన, నవంబర్ 7 : బెల్లంపల్లి ఏరియాలోని ఉన్నతాధికారులకు గోలేటి జీఎం కార్యాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విజిలెన్స్‌పై అవగాహన కల్పించినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. సమగ్ర సంస్కృతి–దేశ పురోభివృద్ధి అంశంపై శిక్షకులు కిషోర్ బగాదియ ఉపన్యాసం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్, ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీంరావుజాడే, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహరా, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్‌సలో జీఎం శ్రీనివాస్, అధికారులు

కేంద్రాల్లోనే రైతులు మద్దతు ధర పొందాలి

బెల్లంపల్లి, నవంబర్ 7 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యం విక్రయించాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ సూచించారు. మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వరి కొనుగోలుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తుందని పేర్కొన్నారు. దొడ్డు, సన్న వడ్లు వేర్వేరుగా కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కల్పన, ఆర్డీవో హరికృష్ణ, ఏడీఈ రాజ్‌నారాయణ, తహసీల్దార్ జ్యోత్స్న, వ్యవసాయాధికారి సుద్దాల ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సమర్థవంతంగా పథకాలు అమలు చేయాలి

నస్పూర్, నవంబర్ 7 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సమీకృత పథకాల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో గురువారం కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, డీఆర్‌డీవో కిషన్‌తో కలిసి జిల్లా అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి హాజరయ్యారు. జాతీయ రహదారి 163లో భాగంగా ప్యాకేజీ 1లో 83 శాతంతో 31.4 కిలోమీటర్లు, ప్యాకేజీ 2లో 9.8 కిలోమీటర్లు మొత్తం 164 ఎకరాల సేకరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎన్‌హెచ్ 363లో 42 కిలోమీటర్లు మంచిర్యాల జిల్లాలో పూర్తయి మెయింటెన్స్‌లో ఉన్నట్లు తెలిపారు. ఎన్‌హెచ్ 63లో భాగంగా 4వ దశలో 35 కిలోమీటర్ల కోసం లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాని, ఇది గ్రీన్‌ఫీల్డ్ హైవే అని తెలిపారు. అలాగే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందిస్తుననట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి

తాండూర్, నవంబర్ 4 : పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ సూచించారు. సీసీఐ ఆధ్వర్యంలో మండలంలోని రేపల్లెవాడ శ్రీరామ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని గురువారం అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, సీసీఐ జిల్లా అధికారి రాజశేఖర్, ఏఎంసీ కార్యదర్శి భాస్కర్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, మండల నాయకులు సూరం రవీందర్‌రెడ్డి, గట్టు మురళీధర్‌రావు, ఎండీ ఈసా, సిరంగి శంకర్, సాలిగామ బానయ్య, పేరం శ్రీనివాస్, మాసాడి తిరుపతి, సీఐ కుమారస్వామి, ఎస్ఐలు డీ కిరణ్‌కుమార్, సౌజన్య, జిన్నింగ్ మిల్ యజమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వినోద్

నిరసన తెలిపే హక్కు లేదా?

- ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక ఆందోళనలో పాల్గొన్నాడని హెచ్ఎం సస్పెన్షన్
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చర్యలన్న జిల్లా విద్యాశాఖ అధికారులు
- ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘాల మండిపాటు

మంచిర్యాల, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ సర్కారు పాలనలో ప్రజలకు నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా పోతున్నది. మార్పు పేరిట మోసం చేసిన కాంగ్రెసోళ్లు.. ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రైతులు, పేదలు, ఉద్యోగులు ఇలా ఎవరు ప్రశ్నించినా నోరు నొక్కేస్తున్నారు. తాజాగా ఓ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయడం విమర్శలకు తావిస్తున్నది. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని దిలావర్‌పూర్–గుండంపల్లి గ్రామాల మధ్య ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా కొన్ని రోజులుగా ఆ గ్రామాల రైతులు, ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. వీటికి మద్దతుగా నిలిచాడన్న కారణంతో నిర్మల్ పట్టణంలోని బాగులవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. ఆయన ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాటం చేసే జేఏసీ కమిటీ చైర్మన్‌గా తప్పుడు ప్రచారం చేస్తూ.. శాంతి భద్రతలకు విఘాతంగా కలిగిస్తున్నాడని సస్పెన్షన్ ఆర్డర్‌లో పేర్కొన్నారు. సదరు హెచ్ఎం గత నెల 18న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు తన వాట్సాప్ నుంచి సందేశాలు పంపించాడని, ఉద్యోగిగా ఉండి ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాడని జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ విషయమై ఎస్పీ పూర్తి ఆధారాలతో కలెక్టర్‌కు రిపోర్ట్ చేశారని, కలెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఆయనపై చర్యలు తీసుకున్నామని చెబుతున్నారు. కాగా, ప్రజా అభిప్రాయాలను గౌరవించి, సమాజంపై అవగాహన ఉన్న వ్యక్తిగా పోరాటానికి సిద్ధమవడం ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం ఎలా అవుతుందని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. రైతులు ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకిస్తున్న మాట వాస్తవమా.. కాదా.. ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. హెచ్ఎం విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. కక్షపూరితంగా రిపోర్ట్‌లు తయారు చేసి సస్పెండ్ చేయడం సరికాదని, ఆయన సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లో కొనసాగేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి : టీటీయూ జిల్లా అధ్యక్షుడు

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు, రైతులకు మద్దతు ఇచ్చినందుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆరెపల్లి విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేయడం సరికాదని టీటీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఖండించారు. ఉపాధ్యాయుడు కూడా ప్రజల్లో ఒకరేనని, వారికి కూడా సామాజిక బాధ్యత ఉంటుందన్నారు. ఈ పరిశ్రమ వల్ల అక్కడి వాతావరణం దెబ్బతింటుందని, అందుకే తనవంతు బాధ్యతగా మద్దతు తెలిపారన్నారు. ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేయాలని టీటీయూ జిల్లా కమిటీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

బర్రెల మందపై చిరుత దాడి

హాజీపూర్, నవంబర్ 7 : ముల్కల్ల శివారులోని ర్యాలీవాగు ప్రాజెక్టు పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో బుధవారం మేతకు వెళ్లిన బర్రెల మందపై చిరుత పులి దాడి చేసినట్లు లక్షెట్టిపేట ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ ఏ సుభాష్ తెలిపారు. విషయం తెలుసుకొని సంఘటనా స్థలానికి చేరుకొని, పాదముద్రలు సేకరించినట్లు చెప్పారు. చిరుతపులి అడుగులుగా గుర్తించామన్నారు. రాదండ్ల ఓదమ్మకు చెందిన బర్రె గాయపడిందని తెలిపారు. అయితే దాడికి పాల్పడింది పెద్ద పులి అని బాధితురాలు గ్రామస్తులు అంటున్నారు. పశువుల యజమానులు, సమీప ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

మీడియా ప్రతినిధులకు అవార్డులు

నస్పూర్, నవంబర్ 7 : 2024లో జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంపొందించడంలో మీడియా నిర్వహించిన పాత్ర గుర్తించి, అవార్డులు అందిస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, రేడియా, ఆన్‌లైన్, సోషల్ మీడియా ప్రతినిధులకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అవార్డులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలతో నామినేషన్లు సమర్పించాలని, 25న రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపనున్నట్లు తెలిపారు.

ఒకరికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 7 : గంజాయి సాగు కేసులో సిర్పూర్(యూ) మండలం పంగిడి గ్రామానికి చెందిన ఆత్రం అమృతరావ్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జడ్జి ఎం వీ రమేశ్ గురువారం తీర్పునిచ్చారని జైనూర్ సీఐ రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆత్రం అమృతరావ్ తన వ్యవసాయ క్షేత్రంలో గంజాయి సాగు చేస్తున్నట్టు సమాచారం మేరకు 2021లో అప్పటి జైనూర్ ఎస్ఐ విష్ణువర్ధన్ దాడులు చేశారు. ఆయనపై అప్పటి సీఐ హనోక్ కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపర్చగా, పీపీ జగన్మోహన్ రావు సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో జడ్జి తీర్పునిచ్చారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

లక్షెట్టిపేట, నవంబర్ 7 : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్ సూచించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్‌కుమార్, ఏజీపీ సత్యం, న్యాయవాది కొమిరెడ్డి సత్తన్న, న్యాయవాదులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలి

పెంచికల్‌పేట్, నవంబర్ 7 : సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని ఎంఈవో టీ రమేశ్ బాబు పేర్కొన్నారు. చెడ్వాయి జడ్పీహెచ్ఎస్‌లో గురువారం చెకుముకి సైన్స్ సంబురాలకు సంబంధించిన పాఠశాల స్థాయి ప్రశ్నపత్రాలను ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు రాజ కమల్ రెడ్డి, ఉపాధ్యాయులు రాకేశ్, సంతోష్ కుమార్, ఎండీ తాజ్ పాషా, శిల్ప, సుమిత, అబ్దుల్ పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం

వాంకిడి,నవంబర్ 7: గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్ విషయంలో ప్రభుత్వం నేటికీ స్పందించకపోవడం బాధాకరమని తుండుదెబ్బ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కోట్నాక విజయ్‌కుమార్ అన్నారు. ఫుడ్ పాయిజన్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం వాంకిడి మండల కేంద్రంలోని నాగ్‌పూర్–హైదరాబాద్ అంతర్జాతీయ రహదారిపై తుండుదెబ్బ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఫుడ్ పాయిజన్ జరిగి పది రోజులు కావస్తున్నా నేటికి కారణాలు వెల్లడించకపోగా, హెచ్ఎంను అధికారులు సమర్థిస్తున్నారని ఆరోపించారు. నాణ్యత లేని రంగుమారిన భోజనం పెట్టారని స్వయంగా విద్యార్థులే చెప్పినా హెచ్ఎంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

వాంకిడి, నవంబర్ 7 : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని డీఆర్డీవో దత్తారాం సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకునేందుకు రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని, అర్హులైన వారు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఓటరు నమోదు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

దండేపల్లి, నవంబర్ 7 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్)ఆధ్వర్యంలో దండేపల్లి మండలం తాళ్లపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్–14 బాల, బాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు గురువారంతో ముగిశాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి బాలుర జట్లు 26, బాలికల జట్లు 12 పాల్గొన్నాయి. ఫైనల్లో తాళ్లపేట బాలుర జట్టు ఎంజేపీ గుడిపేట జట్టుపై విజయం సాధించింది. బాలికల విభాగంలో టీజీడబ్ల్యూఆర్ఎస్(గర్ల్స్) లక్షెట్టిపేట జట్టు తాళ్లపేట జట్టుపై విజయం సాధించింది. జిల్లాస్థాయికి ఎంపికైన మతిన్, రక్షిత్, ధనుష్, శ్రావణి, మనస్వినిని ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం బహుమతులు అందజేశారు. ఎస్‌జీఎఫ్ కన్వీనర్ ఫణిరాజా, టోర్నీ కన్వీనర్ సిరంగి సుదర్శన్, పీడీ రోజువర కుమారి, డీఆర్‌వో సాగరిక, వాలీబాల్ శిక్షకులు బీ మహేశ్(పులి), అఫ్రోజ్, రాజు ఉన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

సీసీసీ నస్పూర్, నవంబర్ 7 : జాతీయ స్థాయి కరాటే పోటీలకు సీసీసీ నస్పూర్‌లోని బ్రిలియంట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అవని, సాక్షివర్మ, సాన్వి, శ్రీనిధి, ఆరాధ్య, సన్నీ, వేదశ్రీ, స్నీక్ష, ఆలియా, అమాన్, శ్రీనివేద్, కార్తీక్, అన్నిత్, శ్రీరిష్విక్, వెంకటరమణ, విజ్ఞాన్‌జీ, హర్షిత్, జ్యోషిత్, రితిక్, జేబీ ఆసీన్, రమాకాంత్ ఎంపికైనట్లు కరాటే మాస్టర్ రంగ రమేశ్ తెలిపారు. కాగజ్‌నగర్‌లో 17వ తేదీన 5వ జాతీయస్థాయి ఓపెన్ టూ ఆల్ స్టైల్ కరాటే–కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్–2024 జరుగనున్నదని పేర్కొన్నారు. ఇందులో విద్యార్థులు సింగిల్ కటాస్, టీం కటాస్, స్పారింగ్, వెపెన్, తదితర గ్రూప్ విభాగాల్లో తలపడనున్నారని తెలిపారు. వీరిని పాఠశాల చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, హెచ్ఎం రవికుమార్, ఇన్‌చార్జి సారిక, తోటి విద్యార్థులు అభినందించారు.

జైపూర్, నవంబర్ 7 : జాతీయ స్థాయి ఆట్యాపాట్య క్రీడాపోటీలకు జైనూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన 9, 10వ తరగతులకు చెందిన పీ రాం, ఈ సాయిచంద్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. తమిళనాడులోని ఏరోడ్‌లో 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే క్రీడల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు..

తాండూర్, నవంబర్ 7 : ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు అచ్చలాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు అభిరామ్(9వ తరగతి), రిత్విక్ (7వ తరగతి) ఎంపికైనట్లు పీడీ సాంబమూర్తి తెలిపారు. 6వ తేదీన జరిగిన జోనల్‌స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 టోర్నీలో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని జియాగూడ గంగపుత్ర సంఘం వీర అభిమన్యు వ్యాయామశాలలో 8 నుంచి 10వ తేదీ వరకు జరుగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. హెచ్ఎం పీ ఉమాదేవి, ఉపాధ్యాయులు డీ రాజేశ్వర్‌రావు, ఎస్ శ్రీనివాస్, సుధాకర్, శ్రీనివాస్‌గౌడ్, హరిప్రసాద్, భాస్కర్, రవి, కే శ్రీనివాస్, అంజి రెడ్డి, డీ శ్రీనివాస్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఫణిరాజా, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చిలుకమ్మ, గ్రామస్తులు అభినందించారు.

'జిల్లాతో అనుబంధం విడదీయరానిది'

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 7 : జిల్లాతో రెండేళ్ల అనుబంధం మర్చిపోలేనిదని బదిలీపై వెళ్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్ అన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న వాసుదేవ్‌తో పాటు, నూతనంగా జిల్లకు వచ్చిన శేషరావవును విద్యుత్ శాఖ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. నూతన జిల్లా అధికారి మాట్లాడుతూ.. జిల్లాలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేలా కృషి చేస్తానని, సిబ్బందికి అన్ని విధాలా అందుబాటులో ఉండి పని చేస్తానని తెలిపారు. డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాద స్థలాల గుర్తింపు

హాజీపూర్, నవంబర్ 7 : మండలంలోని జాతీయ రహదారి 63పై జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు గురువారం ప్రమాద స్థలాలను అధికారులు పరిశీలించారు. ముల్కల్ల బస్టాండ్, ముల్కల్ల బ్రిడ్జి, వేంపల్లి జీపీ కార్యాలయ సమీపంలో ప్రాంతాలను మంచిర్యాల ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్, ఎంవీఐ కిషోర్, నేషనల్ హైవే అథారిటీ ఇంజినీర్ జగదీష్ ప్రమాద స్థలాలుగా గుర్తించారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని వాహనదారులకు సూచించారు.

శ్రీరాంపూర్, నవంబర్ 7 : శ్రీరాంపూర్ ఏరియా రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎన్‌హెచ్–63 అధికారులతో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ చర్చలు జరిపారు. ఎన్‌హెచ్ 63 ఏఈ జగదీశ్వర్, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్‌తో కలిసి ప్రమాదాలు జరిగే ప్రాంతాలను సందర్శించారు. బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ అధికారులకు సూచనలు చేశారు. వేగ నిరోధక సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, కెమెరాలు, లైట్లు, స్పీడ్ గన్ కెమరాలు, జంక్షన్ల వద్ద జీబ్రా క్రాసింగ్, లైనింగ్ రోడ్డు రిఫ్లెక్టింగ్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

డీటీడీవో సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోవాలి

కాసిపేట, నవంబర్ 7 : డీటీడీవో గంగారాం సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కాసిపేట మండల కేంద్రంలో గురువారం వారు మాట్లాడారు. మంచిర్యాలలోని ప్రభుత్వ ఆశ్రమ ప